ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



లిమిట్స్ దాటొద్దు..!

- ప్రజల్లో చులకన కావద్దు
- మహానాడు వేదికపై వివాదాలు వద్దు
- టీడీపీ నేతలకు చంద్రబాబు హితవు
- మైనింగ్, గ్యాంబ్లింగ్, ఇసుక మాఫియాపై ఉపేక్షించవద్దు
- ఎమ్మెల్యేలు ఇబ్బంది పెడితే నా దృష్టికి తెండి
- కలెక్టర్, ఎస్పీలకు చంద్రబాబు ఆదేశం
- ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం విజయవంతంపై ప్రశంసలు
- కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇవ్వండి
- సీఎంకు నేతల విజ్ఞప్తి



కడపలో నిర్మిస్తున్న టీడీపీ జిల్లా కార్యాలయ నమూనా చిత్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితతో కలిసి ఆవిష్కరిస్తున్న చంద్రబాబునాయుడు.. చిత్రంలో రితేశ్‌రెడ్డి, చైతన్య రెడ్డి, వరదరాజుల రెడ్డి, భూపేశ్ రెడ్డి, ఆర్.మాధవి, గోవర్దన్ రెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్

కడప, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): "జిల్లాలో ఎమ్మెల్యేలు ఇతర నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోవద్దు.. జనాల్లో పార్టీని చులకన చేయవద్దు. మీ లిమిట్స్ దాటవద్దు.. ఎమ్మెల్యేలు లేనిచోట ఇన్‌చార్జిలదే బాధ్యత" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు హితబోధ చేశారు. ఒంటిమిట్టలోని రాములోరి కల్యాణానికి శుక్రవారం ప్రభుత్వం తరఫున చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, బద్వేలు టీడీపీ నేత రితీశ్‌కుమార్‌రెడ్డి, ఎస్.గోవర్ధన్‌రెడ్డి మరికొందరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పలు విషయాలపై వారికి మార్గనిర్దేశం చేశారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు..

● పులివెందులలో ఇటీవల టీడీపీ సమావేశంలో ఇన్‌చార్జ్ బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి గొడవ జరిగింది. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ పక్క నియోజకవర్గాల్లో ఎవరూ వేలు పెట్టవద్దని పులివెందులలో బీటెక్ రవినే ఇన్‌చార్జి.. ఆయన నేతృత్వంలో పనిచేయాల్సిందే అన్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కానీ లేకపోతే పశ్చిమ రాయలసీమకు సంబంధించిన జిల్లాల్లో పార్టీ కార్యక్రమాలు చూసుకోవాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి సూచించారు.

● పక్క నియోజకవర్గాల్లో వేలు పెట్టి ప్రజల్లో చులకన కావద్దు. వేరే నియోజకవర్గాలకు సంబంధించి ఎమ్మెల్యేలు ఎవరైనా ఎంటరై పనిచేయాలని వత్తిడి చేస్తే చేయవద్దని అలాంటివి తన దృష్టికి తీసుకు వస్తే వారి కథ తాను చూస్తానని కలెక్టరుకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

● కడపలో మహానాడు నిర్వహణ అప్పజెబితే ఏకాభిప్రాయం లేకుండా ఫిర్యాదు చేసుకోవడంపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. వివాదాస్పద భూములు, టీడీపీకి సంబంధించిన వారి భూముల్లో నిర్వహించకూడదని.. టెక్నికల్ టీం వచ్చి స్థలాన్ని ఫైనల్ చేస్తుందని అన్నారు.

● బద్వేలు విషయం చర్చకు రాగా.. అక్కడ 25 ఏళ్లుగా పార్టీ లేవలేదని ఇక ఎప్పుడు లేపుతారంటూ చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు.

● మైనింగ్, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణాలో పార్టీ నేతలు ఎవరూ జోక్యం చేసుకోవద్దు, ఈ ప్రభుత్వానికి చెడ్డ తేవద్దని హెచ్చరించారు. వీటిలో ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చారు. వైసీపీ హయాంలో నమోదైన అక్రమ కేసులు, రౌడీ షీట్ కేసులు పరిశీలించాలని అన్నారు.

● చౌకదుకాణాల్లో బియ్యం మిస్ యూజ్ చేసిన డీలర్లపై రెవెన్యూ రికవరీ యాక్టు కేసు నమోదు చేయండి.. అంతేకానీ డీలర్లకు తక్కువగా సరుకులు ఇవ్వవద్దంటూ ఆదేశించారు.

● కడపలో జీప్లస్-1లో నిర్మిస్తున్న టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయ నమూనా ఫొటోను సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. పార్టీ ఎన్ని చదరపు అడుగులు విస్తీర్ణంలో నిర్మించేది, పార్కింగ్ ఇతర విషయాలను జిల్లా అధ్యక్షుడు సీఎంకు వివరించారు.

● ఇక శనివారం కడప విమానాశ్రయంలో చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో కడప నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదని తెలుపగా.. జిల్లాకే పదవుల్లో ప్రాధాన్యత లేదని టీడీపీ అధ్యక్షుడు అన్నారు. రెక్కిపై చేసి పదవులు కష్టపడ్డ వారికి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. నామినేటెడ్ పోస్టుల్లో తనకు అవకాశం ఇవ్వాలని హరిప్రసాద్ అడిగారు.

● కడప - రేణిగుంట రహదారి నిర్మాణానికి అడ్డంకులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సీఎం దృష్టికి తెచ్చారు. వన్యప్రాణులు తిరిగే చోట వాటి ప్రాణాలకు ముప్పు లేకుండా బ్రిడ్జి నిర్మిస్తే సరిపోతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయాన్ని ప్రధానమంత్రి మోదీ, గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

● ఒంటిమిట్టలో రాములోరి కల్యాణం సందర్భంగా ఏర్పాట్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వసతులు కల్పించడంతో సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి, వీరబ్రహ్మం, కలెక్టరు చెరుకూరి శ్రీధర్‌లను ప్రశంసించారు.

ఆకేపాటి భూ ఆక్రమణలపై ఆగ్రహం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాధరెడ్డి ఆకేపాడులో ఐదెకరాల భూమిని అక్రమంగా రిజిస్టరు చేసుకున్నారంటూ రాజంపేట టీడీపీ నేత సుబ్బనరసయ్యనాయుడు శనివారం సీఎం చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ ఐదెకరాలలో 1.50 ఎకరాలను టీటీడీకి రాయించి దేవస్థాన నిధులతో కల్యాణమండపం నిర్మించారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రబాబు ఇంత మోసమా అంటూ ఆశ్చర్యపోయి, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. శనివారం ఉదయం టీడీపీ నేతలతో భేటీ అనంతరం 10.15కు ఒంటిమిట్టనుంచి రోడ్డుమార్గాన కడప విమానాశ్రయం చేరుకుని విమానంలో గన్నవరం బయల్దేరి వెళ్లారు.

కడప పీ-4 స్టార్టప్

● నామకరణం చేసిన చంద్రబాబు

సుమారు రూ.9కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో రిమ్స్ రోడ్డులోని ఓ కళాశాల వద్ద 26వేల చదరపు అడుగుల్లో జీప్లస్-3 (స్టార్టప్) నిర్మించనున్నారు. ఇక్కడ 250 మంది పనిచేసే ఎగ్జిక్యూటివ్ క్యాబిన్‌లు, మౌలిక వసతులు కల్పిస్తారు. ఇక్కడ యువతకు ట్రైనింగ్ ఇవ్వడం, ఎకో సిస్టం డెవలప్ చేయడం, కంపెనీకి అవసరమైన శిక్షణ ఇస్తారు. దీన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే రత్నం టాటా ఇన్‌స్టిట్యూట్‌తో అనుసంధానం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కలెక్టరు ఓ మంచి స్టార్టప్‌ను ఏర్పాటు చేస్తున్నారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేలకు సూచించారు. దీనికి 'కడప పీ-4 స్టార్టప్'గా చంద్రబాబు నామకరణం చేశారు. తెలంగాణకు టీహబ్ ఎలా ఉపయోగపడుతుందో కడప స్టార్టప్ కూడా యువతకు పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడుతుందన్నారు. వారంలో టెండర్లు నిర్వహించి ఐదు నెలల్లో పూర్తి చేయాలన్నారు.



కడపలో నిర్మించనున్న స్టార్టప్ నమూనా

ఆధ్యాత్మిక కేంద్రంగా ఒంటిమిట్ట: సీఎం

ఒంటిమిట్టను ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాములోరి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటనకు సీఎం జిల్లాకు వచ్చారు. శనివారం ఉదయం ఒంటిమిట్టలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో కలిసి ఒంటిమిట్ట అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఒంటిమిట్ట సందర్శనకు భక్తుల సంఖ్య పెరుగుతోందని యాత్రీకులను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అందుకు తగ్గట్లుగా ఒంటిమిట్ట క్షేత్రం అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించాని ఆదేశించారు. తిరుపతి, కాణిపాకం-తాళ్లపాక, గండికోట, ఒంటిమిట్ట, శ్రీకాళహస్తి సర్క్యూట్‌లను 2 రోజులు, 3 రోజుల పర్యటనతో ఆధ్యాత్మిక సాంస్కృతిక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని టీటీడీ, టూరిజం శాఖను సీఎం ఆదేశించారు. ఒంటిమిట్ట చెరువును సుందరీకరించి బోటింగ్‌తో పాటు చెరువు మధ్యలో జాంబవంతుని విగ్రహం ఉంచాలన్నారు. టీటీడీ, దాతలు ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ఒంటిమిట్టలో వసతుల మెరుగుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మిగిలిన ఆలయ పనులన్నీ ఏఎస్ఐ సాయంతో చేపట్టాలన్నారు. రామతీర్థం, లక్ష్మణ తీర్థాల ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తూ అభివృద్ధి జరగాలన్నారు. రామాయణం, హిందుత్వ విలువలు తెలిపే విధంగా పోతనగిరిపై శ్రీరామ ప్రాజెక్టు నిర్మాణం, ఒంటిమిట్టలో భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటుకు అన్నప్రసాద భవన నిర్మాణం చేయాలన్నారు. మతపరమైన టూరిజం సర్క్యూట్‌లో భాగంగా చేయడానికి ఆలయం పరిసర ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని, యాత్రికులకు సౌకర్యాల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

కల్యాణోత్సవం విజయవంతం

● ఇదే స్ఫూర్తితో పనిచేయండి : ఎస్పీ

కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ ఘట్టం విజయవంతంగా ముగిసిందని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి పలువురు రాష్ట్ర ప్రముఖులు హాజరైన నేపథ్యంలో సజావుగా నిర్వహించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది చూపిన నిబద్ధత, అంకితభావం, సమయస్ఫూర్తి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. అందరి సమిష్టి కృషి కారణంగానే విజయవంతంగా, ఎలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా బందోబస్తు నిర్వహించగలిగామని అన్నారు. ఎవరికి కేటాయించిన విధులు వారు అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా నిర్వర్తించడం, వేలాదిగా తరలివచ్చిన సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ సజావుగా సాగేలా నిరంతరం పర్యవేక్షించడం, ప్రసాదాల వితరణ కౌంటర్లు, ఆలయ క్యూలైన్ల వద్ద బందోబస్తు విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎస్పీ శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో..
జిల్లాకు 22వ స్థానం

● మెరుగుపడిన ఉత్తీర్ణత శాతం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 32,885 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫస్టియర్‌లో 61శాతం, సెకండియర్ విద్యార్థులు 75శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో వైఎస్సార్ కడప జిల్లా 75 శాతంతో రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల్లో గణనీయమైన వృద్ధి కనిపించింది. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 15,301 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 9,295 మంది (61శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 6,994 మందికి గాను 3,795 (54శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 8,307 మందికి గాను 5,500 మంది (66శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించి 12,878 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 9,688 మంది (75శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 5,752 మందికి గాను 4,005 మంది (70శాతం), బాలికలకు సంబంధించి 7,126 మందికి గాను 5,683 మంది (80శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 50శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 21వ స్థానం సాధించింది. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గత ఏడాది 24వ స్థానంలో నిలవగా ప్రస్తుతం 22వ స్థానంలో నిలిచింది. ఈ ఫలితాలపై ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. గతం కన్నా మెరుగైన ఫలితాలు సాధించామని అన్నారు. రాబోయే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని అన్నారు.

వివిధ యాజమాన్యాల ఉత్తీర్ణత వివరాలు

ప్రథమ సంవత్సర ఫలితాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 49శాతం, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 17శాతం, హైస్కూల్ ప్లస్ 22శాతం, మోడల్ స్కూల్ 50శాతం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ 86శాతం, కేజీబీవీ 68శాతం, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 63శాతం ఉత్తీర్ణత సాధించాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 70శాతం ఉత్తీర్ణత సాధించగా, ఎయిడెడ్ 42శాతం, హైస్కూల్ ప్లస్ 42శాతం, మోడల్ స్కూల్ 76శాతం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ 92శాతం, కేజీబీవీ 81శాతం, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 76శాతం ఉత్తీర్ణత సాధించాయి.

కమలాపురం జీరో

జిల్లాలోని కమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో కేవలం ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

సత్తాచాటిన ప్రభుత్వ కాలేజీ విద్యార్థి



షరాబు శ్రీరాం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి మంచి ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి షరాబు శ్రీరాం ఎంపీసీలో 984 మార్కులు సాధించారు. ముదనూరుకు చెందిన ఈ విద్యార్థి తండ్రి త్రివిక్రమాచారి ఆర్ఎంపీ కాగా తల్లి సుప్రజ టైలర్. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీలో వందశాతం మార్కులు సాధించినట్లు విద్యార్థి తెలిపారు. తాను ఇంజినీరింగ్‌లో సీఎస్‌సీ తీసుకుని మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించడం లక్ష్యంగా పెట్టుకున్నా అన్నారు. శ్రీరాంను ప్రిన్సిపాల్ త్రివిక్రంరెడ్డి, అధ్యాపక బృందం అభినందించింది.



లహరి

ఎర్రగుంట్ల మండలం తుమ్మలపల్లెకు చెందిన గంగవరం లహరి ఎంపీసీలో 992 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు గంగవరం గంగిరెడ్డి, ఆశాజ్యోతి సాధారణ రైతు కుటుంబానికి చెందిన వారు. లహరి విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో చదివారు.

వైభవం.. రథోత్సవం



కోదండరాముడి రథోత్సవం సందర్భంగా జనసంద్రంగా మారిన ఒంటిమిట్ట

● జనసంద్రమైన ఒంటిమిట్ట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి పండువెన్నెలలో సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహిచారు. అనంతరం సీతారాములు గజవాహనంపై శుక్రవారం రాత్రి ఊరేగారు. శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు రథం స్థానిక బురుజు వద్ద ఆగింది. తిరిగి మూడు గంటలకు ప్రారంభమై 5 గంటలకు రథ ప్రాంగణానికి చేరుకున్నది. సీతారామలక్ష్మణులు రథంపై అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించారు. దారి పొడవునా చెక్కభజనలు, కోలాటాలు, భజన బృందాలు భజనలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి నీరాజనాలు అందించారు. కోదండరాముడి రథోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సిబ్బంది నవీన్, అధికారులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు



రథంలో ఊరేగుతున్న సీతారాములకు మొక్కుకుంటున్న భక్తులు

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి
రూ.8.84 కోట్ల నిధులు విడుదల

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదలయ్యాయి. ముఖ్యంగా చాగలమర్రి-వేంపల్లి స్టేట్ హైవే పనుల్లో భాగంగా ప్రొద్దుటూరు టౌన్ లిమిట్స్‌లో రాజీవ్ సర్కిల్ నుంచి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌వరకు ఉన్న కొర్రపాడు రోడ్డును ఆరు వరుసల రహదారి విస్తరణ కోసం ప్రభుత్వం జీవో నెంబరు 151 ద్వారా రూ.5.34 కోట్లతో 1.97 కిలోమీటర్ల మేర పనులకు శ్రీకారం చుట్టనుంది. అలాగే డిస్ట్రిక్ మేజర్ రోడ్స్‌కింద లింగాపురం - కుచ్చుపాప రోడ్డు అభివృద్ధికి 3/2 నుంచి 7/4 వరకు రూ.3.50 కోట్లతో 4.200 క.మీ మేర బీటీ రోడ్లు కల్వర్టులు సీసీరోడ్లు నిర్మించడానికి ఈ నిధులను రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలా ల్ దండే విడుదల చేశారు. త్వరలో టెండర్ల ప్రక్రియకు అదికారులు శ్రీకారం చుట్టనున్నారు.

మూడేళ్లయినా అద్దె భవనాల్లోనే..


గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల భవనాల్లో కలెక్టరేట్ కార్యాలయం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లా పరిషత్ ఉమ్మడి కడపలోనే..
- పాలనపై ప్రభావం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రం ఏర్పడి ఈ నెల 4వ తేదీకి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అయితే ఇప్పటికీ పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అద్దె భవనాలు కావడంతో కొన్ని కార్యాలయాలు పట్టణంలో ఎక్కడో ఇరుకు వీధుల్లో ఉండగా మరికొన్ని పట్టణానికి దూరంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అదే సమయంలో ఇంకా జిల్లాలో పలు శాఖల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రత్యేకించి రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడి కడప జిల్లాలోనే ఉంది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప జిల్లా పరిషత్ పరిధిలోనే ఉన్నాయి. పలు శాఖలు, సంస్థలు ఇంకా విభజన జరగలేదు. ఈ నేపథ్యంలో.. అధికారులకు పాలనా పరంగా ఇబ్బందులు ఎదరవుతున్నాయి.

గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్

కొత్తగా జిల్లా కేంద్రం ఏర్పడిన సమయంలో కడప రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను రాజంపేట రోడ్డులోని ఓదివేడు వద్ద ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ భవనాల్లోకి తరలించారు. వైసీపీ ప్రభుత్వంలో అదిగో.. ఇదిగో వంద కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మిస్తాం.. ప్రజల సౌకర్యం కోసం.. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేసింది. రింగు రోడ్డుకు సమీపంలో సర్వే నెంబరు 971లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కోసం 70 ఎకరాల భూమిని కూడా కేటాయించింది. అయితే పైసా కూడా నిధులు కేటాయించలేదు. అగ్నిమాపక కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, ఐఅండ్ పీఆర్ కార్యాలయం, సివిల్ సప్లై కార్యాలయం, భూమి కొలతల కార్యాలయం, జిల్లా ముఖ్య ప్రణాళికా కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం, ఆడిట్ కార్యాలయం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం, జిల్లా డ్రగ్స్ కార్యాలయం, వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్ర కార్యాలయం, రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయం, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సంస్థ కార్యాలయం, జిల్లా గృహనిర్మాణ శాఖ కార్యాలయం, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, పర్యాటక శాఖ కార్యాలయం, జిల్లా చేనత, జౌళి శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఓదివీడు సమీపంలోని ప్రభుత్వ కళాశాలల సముదాయాలలో పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, క్రీడలు, డీఆర్‌డీఏ, సహకార సొసైటీ సంస్థ, జిల్లా పంచాయతీ కార్యాలయం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

అద్దె భవనాల్లో కీలక శాఖలు

జిల్లా కేంద్రంలో పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాయచోటి-సుండుపల్లె మార్గంలో ఆర్టీసీ డిపో సమీపంలో ఓ ప్రైవేటు భవనంలో రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నడుస్తోంది. కొత్తపేట రామాపురంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాయలం నడుస్తోంది. ఎస్ఎన్ కాలనీలోని గవర్నర్ కల్యాణమండపం సమీపంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం, చిత్తూరు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జిల్లా గనులు, భూగర్భశాఖ కార్యాలయం, మాసాపేటలో సివిల్ సప్లై డీఎం కార్యాలయం, మాసాపేట జాతీయ రహదారిలో తూనికలు, కొలతల కార్యాలయం నడుస్తోంది. దేవదాయ శాఖ జిల్లా కార్యాలయం వీరభద్రస్వామి గుడి ప్రాంగణంలో అద్దె భవనంలో నడుస్తోంది. స్త్రీ శక్తి భవనం సుండుపల్లె రోడ్డులో, జిల్లా కార్మికశాఖ కార్యాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా అద్దె భవనంలో ఉన్నాయి. ఇంకా ఉమ్మడి జిల్లా నుంచి పలు శాఖలను విభజన చేయకపోవడంతో.. పలు శాఖల అధికారులు కడప నుంచి వారానికి ఓసారి రాయచోటికి వచ్చి వెళ్తున్నారు. జిల్లా పరిషత్ ఇప్పటికీ ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండడంతో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప పరిధిలోనే ఉన్నాయి. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ మండలాలపై అధికారులు పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకున్నారనే చెప్పవచ్చు.


అద్దె భవనంలో తూనికలు, కొలతల కార్యాలయం

పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయం

కడప-రాయచోటి మార్గంలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పట్టణానికి దూరంగా ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 15 మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. కలెక్టరేట్‌లో నలుగురు తహసీల్దార్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంటు పోస్టులు కూడా చాలా ఖాళీగా ఉన్నాయి. హెచ్‌వోడీలు కూడా 31 శాతం మంది లేరు.

ఒంటిమిట్ట, సిద్దవటం.. రెండు జిల్లాల్లో

ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. అయితే ఈ రెండు మండలాలు రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేశారే కానీ.. ఆ మేరకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. మూడు సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం.. అద్దెభవనాల్లో పాలన జరుగుతుండడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.



అద్దె భవనంలో గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

వృద్ధురాలి హత్య

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు



మృతి చెందిన గంగులమ్మ


మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిల్లర అడిగిందన్న ఆగ్రహంతో ఓ వృద్ధురాలిని ఆటో డ్రైవర్ హత్య చేశాడు. తాలూకా ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. పట్టణంలోని బీకే పల్లి జెండా గుట్టకు చెందిన గంగులమ్మ (70) శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్ర కాలనీ సమీపంలో షేర్ ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ విష్ణు ఆమెను ఆర్టీసీ బస్టాండులో కాకుండా సీఎస్ఐ చర్చి దగ్గర ఆమెను దింపేశాడు. దీంతో ఆమె అతనికి 20 రూపాయల నోటు ఇచ్చింది. అక్కడి వరకూ ఆటో చార్జీ 15 రూపాయలే కావడంతో మిగిలిన 5 రూపాయలు తిరిగి ఇవ్వాలని అడిగింది.అయితే, ఆటో డ్రైవర్ చిల్లర లేదంటూ మాట్లాడడంతో, ఐదు రూపాయలు ఇచ్చేవరకూ ఆటో దిగనంటూ ఆమె గొడవ చేసింది ఎంత చెప్పినా వినకపోవడంతో ఆటో డ్రైవర్ ఆమెను ఆటోలో రామాచారిపల్లె వద్ద నున్న చెరువుకట్ట వద్దకు తీసుకెళ్లి కొట్టి చంపేశాడు. ప్రమాదం జరిగిందని వృద్ధురాలివద్దనున్న ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం తెలిసింది. ఆ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అటవీ ప్రాంతంలో వృద్ధురాలు...

- ఆలస్యంగా వెలుగులోకి

కురబలకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ సింగన్నగారిపల్లెలో ఈశ్వరమ్మ(70) కూలి పనులు చేస్తుండేది. ఈమె భర్త ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందాడు. అనంతరం ఐదుగురు సంతానం కూడా మృతి చెందారు. దీంతో ఒంటరితనాన్ని భరించలేక ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. వారం రోజులు క్రితం కురబలకోట సమీపంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఉరేసుకుని మృతి చెందింది. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో ఆ మార్గాన వెళ్లే వారు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వితీయ ఇంటర్‌లో వందశాతం ఫలితాలు


ప్రతిభ చూపిన నిత్యశ్రీ, గంగోత్రి

పీలేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీఆర్‌జేసీ ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలోని ఇంటర్ ద్వితీయ ఏడాది ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన 113 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డా.చెన్నకేశవులు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 116 మందికి గానూ 114 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో పవన్ కుమార్ 986, సింహాద్రి 982, బైపీసీ సెకండియర్‌లో అబ్దుల్ సమీర్ 984, రోహిత్ 984, పవన్‌కుమార్‌రాజు 983, ఎంఈసీ సెకండియర్‌లో భరత్ 976, శ్రీకాంత్‌రెడ్డి 967 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో అజయ్ 467, సంతోష్ 463, బైపీసీలో హర్షవర్ధన్ 434, కార్తీక్ 433, ఎంఈసీలో నరేశ్ 480, లోకేశ్ 460 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అధ్యాపకులతో కలిసి అభినందించారు.

వగళ్ల కేజీబీవీలో: ద్వితీయ ఏడాది ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కేవీపల్లె మండలం వగళ్లలోని కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రావణి తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఏడాదిలో తమ కళాశాల నుంచి 27 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, మొదటి సంవత్సరంలో 34 మందికి గానూ 32 మంది ఉత్తీర్ణులయ్యారని ఆమె వివరించారు. సీనియర్ బైపీసీలో నిత్యశ్రీ 961, గంగోత్రి 942, పల్లవి 928 మార్కులు సాధించారని ఆమె తెలిపారు. జూనియర్ బైపీసీలో నాగవేణి 417, శ్రావణి 411, దేవహర్షిణి 406 మార్కులు సాధించారని ఆమె తెలిపారు.

శోకసంద్రంలో రాచపల్లె

- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు
- చిన్నారుల మృతి దురదృష్టకరం
- ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి



చిన్నారులను మింగేసిన కుంట, రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

చిట్వేలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాచపల్లె శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే ఊరికి చెందిన ముగ్గురు చిన్నారులు కుంటలో పడి మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాములోరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా పిల్లలంతా రంగువల్లులతో ఆనందోత్సాహాల మధ్య ఆడుకుంటున్నారు. పిల్లలు ఆలయం వద్ద ఉన్నారులే అనుకుని కుటుంబ సభ్యులు తాత్సారం చేశారు. చీకటి పడినా పిల్లలు రాకపోవడంతో గ్రామంలో వెతకడం మొదలుపెట్టారు. కానీ చేపలు పట్టేందుకు ఆ గ్రామ సమీపంలోని కుంటలోకి వెళ్లిన పిల్లలు నీటిలోకి దిగారు. లోతు తెలియని చొక్కరాజు దేవానంద్ (7), చొక్కరాజు జయ (7), రెడ్డిచర్ల యశ్వంత్‌రాజు (7)లు నీటిలో మునిగిపోయారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు కుంటలోకి వెళ్లి చూడగా శవాలుగా కనిపించడంతో లబోదిబోమన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం అంత్యక్రియలు ముగిసే వరకు ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమయ్యారు.

కువైత్ నుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు

చిట్వేలి మండలం ఎం.రాచపల్లెలో జరిగిన ఈ ఘటనతో మృతులు జయ, యశ్వంత్‌రాజుల తల్లిదండ్రులు శేఖర్‌రాజు, వెంకటేశ్వర్‌రాజు కువైట్ నుంచి హుటాహుటిన బయలుదేరి ఇంటికి వచ్చారు. తమ కుమారులు మృతిచెందారన్న విషయన్న తెలుసుకున్నప్పటి నుంచి ఇంటికి వచ్చేదాక వారి పుత్ర శోకాన్ని ఆపడం ఎవరితరం కాలేదు. చొక్కా శేఖర్‌రాజు, విజయకు ముగ్గురు కుమారులు. వారిలో ఆఖరివాడు మృతి చెందిన జయ. రెడ్డిచర్ల వెంకటేశ్వర్‌రాజు, సుప్రజలకు కూడా ముగ్గురు కుమారులు. వారిలో ప్రమాదంలో మృతిచెందిన యశ్వంత్‌రాజు మొదటి బిడ్డ. ఆ రెండు కుటుంబాలు వ్యవసాయాధారంగా జీవించేవి. సేద్యంలో నష్టాలు రావడంతో వారు తమ భార్య, బిడ్డలను వదిలి కువైట్‌కు వలస వెళ్లారు. ఇక మృతిచెందిన చొక్కరాజు దేవానంద్ తండ్రి నరసింహరాజు దివ్యాంగుడు. భవన నిర్మాణ కార్మికుడైన ఆయన పక్షవాతంతో మంచాన పడ్డాడు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

చిన్నారుల మృతి దురదృష్టకరమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఖాదీ విలేజ్ బోర్డు ఇండస్ట్రీస్ స్టేట్ చైర్మన్ కేకే చౌదరిలు శనివారం ఉదయం బాధిత కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి ఓదార్చారు. చిన్న బిడ్డల మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో పాటు తాము వ్యక్తిగత సహాయం కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు రామాంజనేయులు, కాకర్ల లారీ సుబ్బరాయుడు, రాజుకుంట గుత్తి నరసింహులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రవికుమార్‌రాజు, జనసేన నాయకులు మాదాసు నరసింహులు, వెంకటేశ్‌రాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నూతన పట్టణాభివృద్ధి సంస్థలకే అధికారాలు

- టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు నుంచి అధికారాలు బదిలీ

కలికిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో కొత్తగా ఏర్పాటైన పట్టణాభివృద్ధి సంస్థలకు అన్ని రకాల ఆమోదాలు జారీ చేసే అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా సాంకేతికపరమైన ఆమోదాలు జారీ చేసే అధికారం కట్టబెట్టడంతో ఇంతవరకూ ఉన్న పరిమితులు తొలగిపోయి వెసులుబాటు లభించింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కుడా), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు ఎలాంటి సాంకేతిక ఆమోదాలు ఇచ్చే అధికారాలు లేకుండా, అప్పటి వైసీపీ ప్రభుత్వం 2019 జులై 19న జీవో జారీ చేసి కట్టడి చేసింది. అన్ని రకాల అభివృద్ధి అంశాలకు సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారాన్ని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరుకు అప్పగించింది. దీని పైన ఒంగోలు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థల అధ్యక్షులు చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కడప), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు అన్ని రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక ఆమోదాలు తెలియజేసే అధికారాలను కట్టబెట్టడంతో పాటు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రతిపాదనలను ఇక నుంచి నేరుగా సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకే పంపుకోవచ్చు. దీంతో ఆయా ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్లకు కూడా ఒక స్పష్టత వచ్చిందని చెబుతున్నారు. ఆయా సంస్థల పరిధిల్లోని మాస్టర్ ప్లాన్లను ఆమోదించుకునే వెసులుబాటు లభించింది. దీంతో పలురకాల ఆమోదాలు అవసరమైన రియల్ ఎస్టేట్ రంగాల వారు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి కూడా పెద్ద ఊరట లభించినట్లయింది.

పట్టణాభివృద్ధి సంస్థల పరిధిల్లో గందరగోళం

ఉమ్మడి కడప జిల్లా మొత్తానికి కడప-ఉడా ఒక్కటే కావడం వల్ల ఒకే పరిధి రావడంతో అక్కడ ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టత వచ్చింది. కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పలమనేరు- కుప్పం-మదనపల్లె (పీకేఎం-ఉడా) పరిధిలో గందర గోళం నెలకొంది. చుడాలో అన్నమయ్య జిల్లాకు చెందిన పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇదే చుడా పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలను చుడా నుంచి విడదీసి పీకేఎం-ఉడా పరిధిలోకి చేర్చారు. ఇక పీకేఎం-ఉడా పరిధిలో మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాలు, తంబళ్లపల్లె నియోజకవర్గం ఉన్నాయి. దీంతో ఒకే నియోజకవర్గంలో రెండు పట్టణాభివృద్ధి సంస్థలు ఉండటంతో పలు విషయాల్లో అయోమయం నెలకొందని చెబుతున్నారు.

పోక్సో కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన ఒకరిపై, కిడ్నాప్ అయ్యేందుకు సహకరించిన మరొకరిపై ఈ కేసు నమోదైనట్లు సీఐ నరసింహులు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వేంపల్లెకు చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను గాంధీరోడ్డులో చికెన్ దుకాణం నిర్వహించే ఆనంద్ వద్ద పనిచేస్తున్న ఫాజిల్ కిడ్నాప్ చేసి వేరే ఊరికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇందుకు చికెన్ దుకాణ యజమాని సహకరించినట్లు ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మార్కెటింగ్ అవకాశాలు


కవర్లు కట్టిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనే డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మామిడికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ హరినాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి తెలిపారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని ఆదర్శ రైతు రమణా రెడ్డి మామిడి తోట, సోలార్ డ్రైయర్ యూనిట్‌లను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ద్వారా డిజిటల్ కామర్స్‌ను మామిడి రైతులకు అందుబాటులో తెచ్చి చిన్న వ్యాపారులు కూడా పెద్ద వ్యాపారులతో పోటీ పడే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కొనుగోలుదారులు, విక్రేతలు ఒకే నెట్‌వర్క్‌లో కనెక్ట్ అయి ఉండడం వల్ల కొనుగోలుదారులు ఉత్పత్తులు, ధరలు, డిస్కౌంట్లను పోల్చుగలుగుతారని వివరించారు. రైతులందరూ తప్పకుండా మామిడికి కవర్లు కట్టాలని, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్ఠంగా 10 వేల కవర్లను 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. మామిడి కాయలు ఎగుమతి చేసే రైతులు 'అపెడా' వెబ్‌సైట్‌లో ఉద్యాన శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల రైతులు మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.10 లక్షల రాయితీ లభిస్తుందన్నారు. మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లతో మామిడికి సంబంధించిన మ్యాంగో పికిల్, ఆమ్‌చూర్, డ్రైడ్ మ్యాంగోస్, మ్యాంగో స్లైసెస్ లాంటివి మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.కోటి వరకు రాయితీ లభిస్తుందన్నారు. అనంతరం వారు పులిచెర్ల మండలం రామిరెడ్డిగారిపల్లెలోని రైతు ధర్మా రెడ్డి మామిడి తోటను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌వో సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టమోటా లారీ బోల్తా.. వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటరమణ

చిన్నమండెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద టమోటా లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి సుండుపల్లె మండలం రాచపల్లికి చెందిన మంగిరి వెంకట్రమణ (51) కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న కేశాపురం ఆంజనేయ స్వామి గుడి వద్ద వారి బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరై మూత్రవిసర్జన కోసం బయటకు వచ్చారు. ఈ సమ యంలో గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి టమోటాల లోడుతో నంద్యాలకు వెళుతున్న బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో వెంకట్రమణ ఆ లారీ కింద పడి మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమా రుడు, కుమార్తె కలరు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి కారు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

నందలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు వద్ద శుక్రవారం రాత్రి చెయ్యేరు వంతెన మీద టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి పెనుప్రమాదం తప్పింది. కంభం నుంచి తిరుమలకు వెళుతున్న తోటకూరి నరేష్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా టైరు పగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందరికి స్వల్పగాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.


కారు టైరు పగిలిన దృశ్యం

ఉపాధికి ఊతం

● జాతీయ పశుసంపద పథకం రైతులకు వరం ● 50 శాతం సబ్సిడీ

● యూనిట్‌స్థాయిని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం



మైలవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ పశుసంపద పథకం (నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్) ఊతంగా మారింది. పూర్తిగా ఆన్‌లైన్ దరఖాస్తులతో ముందుకు సాగే ఈ పథకంపై క్షేత్రస్థాయిలో పాడి రైతులకు, ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. గ్రామాల్లో, పట్టణాల్లో రైతులు ఏర్పాటు చేసే యూనిట్ స్థాయి, రైతు అర్హతను బట్టి రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు ఈ పథకం ద్వారా బ్యాంకు గ్యారెంటీతో రుణం పొందే అవకాశం కల్పించారు. ఇందులో ప్రభుత్వం రూ.50 శాతం సబ్సిడీ అందిస్తుండగా మిగిలిన 50 శాతం యూనిట్ ఏర్పాటు చేసిన రైతు చెల్లించాల్సి ఉంటుంది.

పథకం అమలు విధానం ఇలా..

పశుపోషణతోపాటు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి ఈ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశాన్ని కల్పించారు. పశువుల పెంపకం, గొర్రెల పెంపకం యూనిట్లు, పశుగ్రాసం కొరత నివారించడానికి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విత్తనాల సరఫరా, మాంసం, గుడ్లు, ఉల్లి ఉత్పత్తిలో పరిశోధనలకు ప్రోత్సాహం తదితర యూనిట్లు ఉపాధి కల్పించే దిశగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం దరఖాస్తుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఎల్ఎం యూడీ వై ఎఎంఐఎంఐటీఆర్పీ.ఇన్‌వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రస్థాయి కమిటీ దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివిధ శాఖల అధికారులు క్షేత్ర పరిశీలన తర్వాత కేంద్ర కమిటీకి సిఫార్సు చేస్తారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ అధికారులు దీన్ని పరిశీలించి నిధులు విడుదల చేస్తారు. ఈ పథకం కోసం దరఖాస్తుదారులు ఏ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పథకానికి ఎంపికైనవారు ప్రతినెల పశుసంవర్ధకశాఖ అధికారులకు ఫొటోలు పంపాల్సి ఉంటుంది. పథకాన్ని దుర్వినియోగం చేయకుండా లబ్ధిదారుడి నుంచి గ్యారెంటీ పత్రాన్ని అధికారులు తీసుకుంటారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి కలిగిన వారు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనలు అన్ని స్థాయిలో పరిశీలించి పథకాన్ని మంజూరు చేస్తారు. పాడిపరిశ్రమ వృత్తికి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలి.

- శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి



గొర్రెల మంద



రైతులకు అవగాహన కల్పించాలి

జాతీయ పశుసంపద పథకం ఎంతో ప్రాధాన్యతమైంది. అయితే ఈ పథకంపై రైతులు, ఇతర వర్గాల్లో సరైన అవగాహన లేదు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం గురించి విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంది.

- హనుమంతు, పాడి రైతు, మైలవరం

లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలు

ఈ పథకంలో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల యూనిట్లతోపాటు పచ్చిమేత యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చదువు, వయస్సుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పథకం పొందేవారు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. ఆధార్, డ్రైవింగ్‌లైసెన్స్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు వంటి గుర్తింపు కార్డులు స్థానికత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడేళ్ల ఆదాయపన్ను రిటర్న్ పత్రాలు, ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, భూమి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఏర్పాటు చేయబోయే యూనిట్ మొత్తానికి సంబంధించిన నివేదిక వంటి పత్రాలను అందుబాటులో ఉంచుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మద్యానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

● కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. కడప డిఅడిక్షన్ సెంటరులో శనివారం మద్యం బాధితులు, వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మద్యం దుష్ప్రభావాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిల్లాస్థాయి సీఏఆర్ఈ కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో కలెక్టరు అధ్యక్షుడిగా, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కమిటీ కన్వీనరుగా వ్యవహరిస్తారు. పోలీసు, వైద్య ఆరోగ్య, సామాజిక సంక్షేమ, విద్య, హాస్పిటల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఇద్దరు ప్రముఖులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, మానసిక నిపుణుల వైద్యులు డాక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5లక్షల శాశ్వత విరాళం

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంఘం వీధిలో వెలసిన మంగళగౌరీదేవి పౌర్ణమి వేడుకల్లో అన్నదానం కోసం రూ.5,16,116 నగదు శాశ్వత విరాళంగా అందించారు. వేంపల్లెకు చెందిన నామా నారమ్మ, నామా చిన్నయ్యల కుమారుడు ఎన్ఆర్ఐ నామా నిత్యానంద్ శనివారం విరాళాన్ని బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్‌లకు అందజేశారు. అనంతరం అమ్మవారు గౌరీదేవికి పూజలు చేశారు. బలిజ సంఘం నాయకులు కొత్తూరు రెడ్డయ్య, యడాల రామచంద్ర, నామా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ కళాశాలల హవా



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాలల హవా కొనసాగిందని ఆ కళాశాలల టీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో బి.అంజలి 991 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే సంధ్య 988, పి.సుజన, ఎస్.నుర్స అంజాం, ఆత్రుత, జి.హరికిరణ్ 987 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో కె.మహబూబ్ అలీఖాన్, ఎస్.మహమ్మద్ అబ్దుల్లా, జ్యోత్స్ని 988, ఖానం 987 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్లు సుబ్బారావు, బాల వెంకటరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

సత్తా చాటిన శ్రీచైతన్య అకాడమీ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాలయాజమాన్యం

ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య అకాడమీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని కళాశాల డైరెక్టర్ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో నందిని 987 మార్కులు, బీబీ అనూష 985, రజిత 983, సాయిచరిత 983, వెంకటసాయి 982, విష్ణులోహిత, వైష్ణవి 980 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో అమీనా 984, అయేషా 976తో పాటు మరికొంతమంది ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో కూడా మంచి ఉత్తీర్ణత లభించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

సాయిరాం కళాశాల విద్యార్థుల విజయకేతనం



విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

కడప నగరం శ్రీసాయిరాం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో సాయిశిరీష 978 మార్కులు, రోహిణి 977, స్పందన 972, ఫాతిమ 969, శరణ్య 968 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో త్రిభువన్ 990, తనుశ్రీ 968, అబ్దుల్ రెహమాన్ 962, రఫియాతాజ్ 961, జ్యోతి 960 మార్కులు సాధించారన్నారు. అలాగే ప్రథమ సంవత్సర ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు వచ్చినట్లు స్పష్టం చేశారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

పులివెందుల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో పాడా నిధులతో చేపట్టిన పనులపై శనివారం కూడా విజిలెన్స్ తనిఖీలు సాగాయి. శనివారం వేముల, వేంపల్లె మండలాల్లో ఈ తనిఖీలను రెండు బృందాలలు చేపట్టాయి. శనివారం విజిలెన్స్‌కు సంబంధించిన నాలుగు బృందాలలో రెండు బృందాలు మాత్రమే ఈ తనిఖీలు చేపట్టాయి. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ, పాములూరు, గిడ్డంగివారిపల్లె, నందిపల్లె తదితర గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత పనుల పరిశీలన సాగింది. సీసీరోడ్ల నాణ్యతపై డ్రిల్ చేసి వాటి నమూనాలను సేకరించారు. అలాగే వేముల మండలంలోని వేముల, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత తనిఖీలు సాగాయి. పాడా నిధులతో జరిగిన పనులకు అప్పుడు తీసుకున్న కొలతల్లో ఏమైనా తేడాలున్నాయా అని పరిశీలించారు.

భారత మహిళా క్రికెట్ జట్టుకు శ్రీచరణి ఎంపిక గర్వకారణం

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ఎన్.శ్రీచరణి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శ్రీలంకలోని కొలంబియాలో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు ఎన్.శ్రీచరణి ఎంపికైన సంగతి తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా శనివారం నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి అభినందన సన్మానసభ నిర్వహించారు. తొలుత శ్రీచరణికి తిరుమలేశుని జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్‌ను, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహిస్తుందని.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీచరణి మాట్లాడుతూ భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికకావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేశ్ కుమార్‌రాజు, సంయుక్త కార్యదర్శి సాయి పృధ్వీతేజ, కోశాధికారి మహేంద్రరెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీచరణికి మెమొంటో ఇచ్చి అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

సివిల్ సప్లైస్ స్టాక్ గోడౌన్లలో ఆకస్మిక తనిఖీలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): కడప సివిల్ సప్లైస్ స్టాక్ బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లను రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట మెహర్ సీతారాం సుధీర్ శనివారం తనిఖీ చేశారు. శనివారం కడపలో పర్యటించిన ఆయన రాష్ట్ర డైరెక్టర్ బి.శివ దత్తతో కలసి జిల్లా సివిల్ సప్లైస్ సంస్థ జిల్లా మేనేజరు కార్యాలయానికి చేరుకున్నారు. చైర్మన్‌కు ఆసంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజరు, సిబ్బంది పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ సీతారాంసుధీర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ నుంచి స్టాక్ పాయింట్లకు లూజ్ బ్యాగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్లలో స్టాకింగ్ స్ప్రేయింగ్ సక్రమంగా లేకపోవడం పట్ల చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి డీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



బఫర్ గోడౌన్లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మెహర సీతారాం

ఇసుక తరలింపు విషయమై ఘర్షణ

● పరస్పర ఫిర్యాదులు... ఇరువురిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపు విషయమై టీడీపీకి చెందిన ఇరువురు ఘర్షణ పడ్డారు. వరుసకు బావ బామ్మర్దులు అయిన వీరు ఘర్షణకు పాల్పడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. గురువారం రాత్రి వీరన్నగట్టుపల్లె వద్ద ఇసుక తరలించేందుకు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి వర్గానికి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర వెళ్లగా.. ఆయన బామ్మర్ది విజయ్‌కుమార్ (ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు) వీడి యో తీస్తుండడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయపడ్డారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందారు. శనివారం ఇరువురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడు మృతి

దువ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐ.బోయనపల్లె సమీప కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడి జి.నరసింహరావు (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు...
తోటి మిత్రులతో కలిసి నరసింహా రావు కేసీ కాలువ వద్దకు వెళ్లాడు. మిగతా వ్యక్తులు ఈదులాడుతుండగా ఇతను గట్టుపై కూర్చొని ఉన్నాడు. కొద్దిసేపటికి కనిపించకపోవడంతో వెతుకులాట మొదలుపెట్టారు. ఆలస్యంగా శవమై కాలువలో కనపడ్డాడు. మృతుని తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

బ్యానరు కడుతూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఓ షాపింగ్‌మాల్‌కు సంబంధించి పాత బ్యానరు తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో కరెంటు వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడటంతో వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఉండడంతో చిన్నచౌకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు .. కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన మూలతొట్టి కుమార్ (55) హోర్డింగులకు బ్యానర్లు కట్టే కాంట్రాక్టు తీసుకుని ఆ పనులు చేసుకుంటుండేవాడు. శనివారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న షాపింగ్‌మాల్‌కు సంబంధించి బ్యానరు హోర్డింగుకు పాత బ్యానర్ తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాకు గురై.. కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా బ్యానరు కట్టే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ కనెక్షన్లతో పాటు పలు వైర్లు ఎక్కువగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కన్నుల పండువగా ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి శనివారం ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో వేద మంత్రాలతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా.. అన్నప్రసాద వినియోగం చేశారు. రాత్రి స్వామివారిని హంసవాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. లయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సమస్యల వలయంలో పసుపు మార్కెట్ యార్డు

● షెడ్లు, విశ్రాంతి భవనాలు లేక రైతుల అవస్థలు ● మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంలేక హమాలీల ఇక్కట్లు

కడప రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కడప పసుపు మార్కెట్ యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. రాయలసీమ జిల్లాలతో పాటు, నెల్లూరు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి రైతులు పసుపు, వేరుశనగ తదితర పంటల ఇక్కడికి తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం పసుపు విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి రోజు 250 పసుపు బస్తాల వరకు మార్కెట్‌కు వస్తున్నాయి. కానీ రైతులకు, వారుతీసుకొచ్చిన పంట ఉత్పత్తులకు మార్కెట్ యార్డులో తగిన మౌలిక వసతులు లేకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తగిన షెడ్లు లేకపోవడం వలన వర్షానికి పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. ఏప్రిల్ 3న వచ్చిన అకాల వర్షానికి దాదాపు దాదాపు 2000 పసుపు బస్తాలు తడిసిపోయాయి. తగిన షెడ్లు లేకపోవడం వలనే తమ పంట వర్షపు నీటిలో తడిసిపోయి రూ. 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. మార్కెట్ యార్డు లోతట్టులో ఉండడం వలన వర్షపు నీరంతా రోడ్లపైనే దర్శనమిస్తోంది. పైగా యార్డులో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నీరు బయటికి వెళ్లడానికి వీలులేకుండా ఎక్కడి నీరు అక్కడే ఉండిపోతోంది. దీంతో ఏప్రిల్ 3న కురిసిన వర్షానికి కడప మార్కెట్ యార్డు చెరువును తలపించింది.అకాల వర్షపు నీరంతా బయటికి వెళ్లడానికి వీలులేకపోవడంతో పసుపు నిల్వలను ముంచెత్తింది. చింతకొమ్మదిన్నె మండలం గోపాలపురం గ్రామానికి చెందిన డి. వెంకటరెడ్డి, రామాంజనేయరెడ్డి, అప్పరాజుపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి, ఓబులంపల్లి గ్రామానికి చెందిన రామలింగారెడ్డి, కొత్తపేటకు చెందిన సుబ్బరాయుడుకు చెందిన పసుపు వర్షపు నీటిలో మునిగిపోయింది. పసుపు నిల్వలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డా ప్రయోజనం లేకపోయింది. చూస్తుండగానే వర్షపు నీటితో మునిగిపోయాయి. రూ. 20 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యపు చర్యల వలనే నష్టం వాటిల్లిందని ఆవేదన చెందారు. మార్కెట్ యార్డులో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఒక్కటంటే ఒక డ్రైనేజీ కాలువల కూడా లేదు. వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరంతా మార్కెట్ యార్డులోనే రోజుల తరబడి ఉండిపోతోంది. రైతులకు విశ్రాంతి భవనాలు ఉపయోగంలో లేకపోవడం వలన రోడ్లపైనే గడుపుతున్నారు. మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయాలు మచ్చుకైనా కనిపించడంలేదు. సీసీ కెమెరాలు పనిచేయకుండా పేరుకు మాత్రమే ఉన్నా యి. దీంతో మార్కెట్ యార్డు నుంచి పసుపు బస్తాలను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. మార్కెట్ యార్డు లో ప్రతి ఏడాది రూ. కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఇందుకు రూ.1 లక్షకు రూ.1000లు చెస్‌ను చెల్లిస్తున్నారు. పసుపు మార్కెట్ యార్డులో 35 వరకు గిడ్డంగులు ఉండగా ఒక్కొక్క గిడ్డంగి నుంచి కార్పొరేషన్ శాఖకు రూ.40వేలు వరకు పన్ను చెల్లిస్తున్నారు. కానీ అటు కార్పొరేషన్ అధికారులు గానీ ఇటు మార్కె ట్ యార్డు అధికారులు గానీ ఇక్కడి సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. ఈ కారణంగా రైతులు, హమాలీలు, వ్యాపారులు పలు ఇక్కట్లకు లోనుకావాల్సి వస్తోంది. రైతుల ఉత్పత్తులకు మార్కెట్ యార్డులో తగినవసతులు లేని కారణంగా రైతులు తమ ఉత్పత్తులను పొలాల్లోనే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.



వర్షానికి మార్కెట్ యార్డులో మునిగిపోయిన పసుపు నిల్వలు, ఉపయోగంలోలేని విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు

ఘనంగా శాంతి నికేతన్ పాఠశాల వార్షిక వేడుకలు


బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ ఆత్మ విశ్వాసంతో ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం శంకరాపురం శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలను పాఠశాల వ్యవస్థాపకుడు ఎలియాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి,పాఠశాల డైరెక్టర్ పాపిరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమాల భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విజయకేతనం చూపుతున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో నరసింహసాయి 900 మార్కులు, దీపిక 983, మేఘన 979 మార్కులు సాధించారు. బైపీసీలో సారామాయెనా 968, ఆర్.సాయిస్నేహ 966, గ్లోరీ 964 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

రేపు అంబేడ్కర్ జయంతి వేడుకలు

కడప ఎన్టీఆర్ సర్కిల్,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ మందిరంలో ఈనెల 14న ఉదయం 10గంటలకు అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు, అధికారులు ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు.

నేటి పోరుబాట సదస్సు జయప్రదం చేయండి

చెన్నూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు యూటీఎఫ్ భవనం లో ఆదివారం పోరుబాట సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట కార్యదర్శి బి.లక్ష్మీరాజా ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు చెల్లించాలని, వాటి పరిష్కారం కోసమే పోరుబాటను చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. కర్నూలులో జరిగే పోరుబాట సదస్సుకు జిల్లలోని ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కె.అప్పాయపల్లెలో చోరీ

● రూ.4లక్షలు నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కె.అప్పాయపల్లెలోని బోయిళ్ల నాగమల్లారెడ్డి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఇంటి యజమాని నాగమల్లారెడ్డి అస్తమా, గ్యాస్ట్రబుల్ వ్యాధితో కొంతకాలంగా బాధ పడుతున్నాడు. తన కుమారుడు హైదరాబాదులో ఉండడంతో అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించు కునేందుకు భార్యతో కలిసి బుధవారం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం రాత్రి దొంగలు తలుపు గడియ పగల గొట్టి ఇంట్లోకి ప్రవే శించి బీరువా తెరిచి అందులోని నగదు, బంగారు నగలను చోరీ చేశా రని సమాచారం. శనివారం ఉదయం తలుపు తెరిచి ఉండడాన్ని పక్కింటి వారు గమనించి.. విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై ఇంటి యజమాని నాగమల్లా రెడ్డితో ఫోన్‌లో మాట్లాడగా రూ.4లక్షలు నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు బీరువాలో ఉన్నాయని.. వాటిని దొంగలించి ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్ఐ విద్యాసాగర్ మాట్లా డుతూ ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని దుండగలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుడి నిర్మాణానికి భూమిపూజ



కడప కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగర మాసాపేట సర్కిల్‌లో గత వైసీపీ పాలనలో రోడ్డు ఆక్రమణల పేరుతో ధ్వంసం అయిన రామాలయ నిర్మాణానికి శనివారం టీడీపీ కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర నాయకులు బాలక్రిష్ణయాదవ్, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, జీవీ రమణ తదితరులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాసాపేట డివిజను టీడీపీ ఇన్ ఛార్జ్ మాసాపేటశివ, నాయకులు చవలమూడి శంకర్, సూర్యనారాయణ టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గంధం మహోత్సవం


పూజలు అందుకుంటున్న మజార్లు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):కమలాపురం పట్టణంలోని హజరత్ అబ్దుల్ గఫార్‌షాద్రీ హజరత్ దస్తగరిషాఖాద్రీ, హజరత్ మౌలానా మౌల్వీ ఛాదర్‌మోద్దీన్ షా ఖాద్రీ, హజరత్ జహీరుద్దీన్‌షాద్రీ ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సజ్జాద్ ఏ నషీన్ మహ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రీ, దర్గా కన్వీనరు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం రాత్రి గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి మేళతాళాలతో తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగించారు. గంధోత్సవం ఊరేగింపు తాళి, మార్కెట్, చౌక్ సెంటరు మీదుగా దర్గా చేరుకుంది. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు. అనంతరం భక్తులకు పంచిపెట్టారు. కాగా పకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా ఖవ్వాలీ పోటీలు అలరించాయి

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ చాంద్‌బాష

పులివెందుల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందేనని పోలీసులు పేర్కొన్నారు. శనివారం పులివెందుల పట్టణంలోని తీసేసిన బస్టాండ్ నుంచి మెయిన్ బజార్ మీదుగా వెళ్తు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని తెలిపారు. అర్బన్ సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై ఆటోడ్రైవర్లకు, ద్విచక్రవాహనదారులకు రూల్స్ పాటించాలని ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం చేయరాదన్నారు. ఎస్ఐ నారాయణ, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు


అలంకారంలో విజయదుర్గాదేవి, ప్రత్యేకపూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి విశేష ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే పుణ్యనదీజ లాలతో నింపిన 9 పవిత్ర కలశాలతో నవకలశ స్నపనం నిర్వహించారు. అనంతరం అర్చకులు విజయదుర్గాదేవి అమ్మవారికి స్నపనం, అభిషేకం చేశారు. అనంతరం 10గంటలకు ఆలయ యాగమండపంలో భక్తులచేత చండీహోమం చేయించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులచే 108 దీపాలతో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి 8గంటలకు అమ్మవారికి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రతిపౌర్ణమి రోజున అమ్మవారి ఆశీస్సులు పొందాలని వ్యవస్థాపకుడు మల్లిఖార్జునరావు, దుర్గాప్రసాద్ కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వేంపల్లె సీఐ నరసింహులు హెచ్చరించారు. వేంపల్లెలో ట్రాఫిక్ సమస్యపై శనివారం సాయంత్రం ఆయన పరిశీలన జరిపారు. నాలుగురోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ రంగారావు, ఏఎస్ఐ సాయిబాబా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం మాజీ సర్పంచ్ గౌస్‌పీర్ మృతి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ సీనియర్ రాజకీయ నాయకుడు కమలాపురం మాజీ సర్పంచ్ షేక్ గౌస్‌పీర్ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈయన గత కొద్దిరోజులుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ మధ్యాహ్నం స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1995 నుంచి 2001 కమలాపురం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. అదే విధంగా ఆయన భార్య 2001 నుంచి 2005 వరకు గ్రామ సర్పంచ్‌గా గెలుపొందారు. పలువు రు రాజకీయ

పోరాటాలతో వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి పంపగలం



ధర్నా చేస్తున్న సీపీఐ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతో వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి చేయగలమని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని సీపీఐ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టి కోట్ల విలువచేసే ఆస్తులు కబ్జాచేసి అదాని, అంబానీలకు కట్టబెట్టడం తప్ప మైనార్టీల అభివృద్ధికి ఏమాత్రం కాదని మరీ మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్స్ ఎందుకు రద్దు చేశారో బహిర్గతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, ఎంపీ సుబ్బారెడ్డి, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా తదతర పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అజ్మత్ షాదీఖానాలో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనల ప్రకారం లౌకిక ప్రజాస్వామ్య వాగులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తార్, ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యదర్శి తహీర్, అలిడియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇసాక్ అలీ పాల్గొని మాట్లాడారు. ఆదివారం కడప నగరంలోని నబీకోట్ మజీద్ వద్ద నుంచి యువకులతో నిరసన ర్యాలలీ నిర్వహిస్తున్నామని వీఎస్ మహల్ నుంచి పాతబస్టాండ్, సీఎస్ఐ చర్చి నుంచి ఏడు రోడ్ల వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల ప్రతిభ

కమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులందరూ ఫెయిల్

వల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగాయపల్లె ఆదర్శపాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో జూనియర్ ఇంటర్‌లో 84 మంది పరీక్ష రాయగా 62 మంది పాసయ్యారని, 74 శాతంతో అలాగే సీనియర్ ఇంటర్‌మీడియం పరీక్షల్లో 63 మంది పరీక్షలు రాయగా 51 మంది పాసై 81 శాతంగా వచ్చిందని ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. ఆర్.స్పందన ఎంపీసీ ఫస్టియర్‌లో 422 మార్కులు, సీఈసీలో మొదటి సంవత్సరంలో ఎం.మాబున్నీ 443, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో కె.స్పందన 935 మార్కులు, సీఈసీ సెకండియర్‌లో బి.శ్యామల 853 మార్కులు వచ్చాయని తెలిపారు. అలాగే తమ పాఠశాలలో 6వతరగతి ప్రవేశ పరీక్ష తేదీని 20వతేదీ నుంచి నుంచి 21కి మార్చబడినందని తెలిపారు.

పెండ్లిమర్రి..: మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళశాలలో మొదటి సంవత్సరం 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 42 మంది ,ద్వితీయ సంవత్సరంలో 65 మంది విదార్థులు పరీక్షలు రాయగా 38 మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు.

చక్రాయపేట..: ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470కి గాను 447 మార్కులతో లీలావతి, బైపీసీలో 440కి 410 మార్కులతో గంగోత్రి, సీఈసీలో 500కు గాను 373 మార్కులతో మహమ్మద్ రఫి సత్తా చాటారు. అలాగే రెండో సంవత్సరంలో ఎంపీసీలో 1000కి 938 మార్కులతో రెడ్డి శంకర్, బైపీసీలో 1000కి 910 మార్కులతో బాలచంద్ర, సీఈసీలో 1000కి 712 మార్కులతో జస్వంత్ సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ రంతుబాష తెలిపారు. అలాగే గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 98.5శాతం, సెకండియర్‌లో వందశాతం సాధించినట్లు ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు.

కమలాపురం..: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 33 మంది పరీక్షలు రాయగా అందరూ ఫెయిల్ అయినట్లు ప్రిన్సిపాల్ ఖాజా పర్వీన్ తెలిపారు. సెకండ్ ఇయర్‌లో 14 మంది రాయగా ఇద్దరు మాత్రమే పాస్ అయ్యారు. కాలేజీ మొత్తంలో సెకండియర్ బైపీసీ చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు మాత్రమే పాస్ అయ్యారు.

గతం కంటే కాస్త మెరుగ్గా ...

పులివెందుల రూరల్,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పులివెందుల ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం గతం కంటే మెరుగ్గా నమోదైంది. పులివెందుల పట్టణంలోని వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 73.83శాతంగా నమోదైంది. కాగా ప్రథమ సంవత్సరంలో 56.77శాతంగా నమోదైంది. గత ఏడాది 2024లో ఈ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 63శాతం, ప్రథమ సంవత్సరంలో 49.84శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 75 మందికి గాను 25 మంది ఉత్తీర్ణత సాధించగా 33.33శాతం నమోదైంది. ప్రథమ సంవత్సరంలో 62 మందికి గాను 8 మంది ఉత్తీర్ణతసాధించగా 12.90శాతంగా నమోదైంది. అలాగే పులివెందులలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరంలో 94.11శాతంగా నమోదైంది. ప్రథమ సంవత్సరంలో 87.87శాతంగా నమోదైంది. తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 93.62శాతం, ప్రథమ సంవత్సరంలో 88.37శాతంగా నమోదైంది.

లింగాల..:లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇప్పట్ల సమీపంలో ఉన్న ప్రతిభా కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఫలితాలు సాధించారు. లింగాల ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరంలో 82శాతం, రెండో సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు తెలిపారు. ప్రతిభా కళాశాలలో మొదటి సంవత్సరంలో 94శాతం, రెండవ సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు.

వేముల..: ఇంటర్‌మీడియట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బయ్య తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో 19 మందికి గాను 18 మంది, మొదటి సంవత్సరంలో 75 మందికి గాను 57 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనుప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.











ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



శ్రీజ వెంకట చంద్రిక పిర్దోస్ భార్గవి లక్ష్మీదీపిక వీరగణేష్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీ విద్య జూనియర్ కళాశాలలో..

స్థానిక శ్రీ విద్య జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో గీతాంజలి 1000కి 991 మార్కులు, తేజశ్విని 990, బైపీసీలో షఫియా 990 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీలో గణేష్, మునిచంద్రలు 470కి 466, రంగ హర్ష వర్ధన్, సుమయసుల్తానా 465 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమణరావు, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామమోహన్, అధ్యాపకులు అభినందించారు.



శ్రీ విద్య కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

దీప్తి జూనియర్ కళాశాలలో..

దీప్తి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వెంకటజశ్వంత్ 984, మహిధర్‌రెడ్డి 983, వెంకటలక్ష్మి 982 మార్కులు సాధించారు. బైపీసీలో ఆహిల్‌రషీద్ 964, సంతోష్‌కుమార్ 955, సుకీర్తిరెడ్డి 952 మార్కులు సాధించగా మొదటి సంవత్సరం బైపీసీలో పావని, సబియా 433, బూస్రార య్యాన్ 432 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు సునీల్‌బాబు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న దీప్తి కళాశాల అధ్యాపకులు

అభ్యాస్ జూనియర్ కళాశాలలో..

అభ్యాస్ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో అరవింద్, ప్రసన్నలక్ష్మి, జయహంసిక 990, చైతన్యకుమార్, నాగతన్మయి 988 మార్కులు సాధించారు. హారిక 987, మానస 986, దివ్యవాణి, హర్షిత, శ్రావ్యలు 983, రంగసాయి, నాగలక్ష్మయ్య 982 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కుషాలిని 466, గురుదివ్య 464, సూర్యాంజలి 463, ద్వితీయ సంవత్సరం బైపీసీలో హరిచందన 982 మార్కులు సాధిచారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ బచ్చల వీరపత్రాప్, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



అభ్యాస్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మాస్టర్స్ జూనియర్స్ కళాశాలలో..

మాస్టర్స్ జూనియర్ కళాశాల ఎంఈసీ, సీఈసీలో మొదటి సంవత్సరంలో లిఖిత్ ఫణితేజ 500కు 489, ముబిన్‌పర్వత్ 479, లిఖిత 476, మునిచరణ్ 473 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సాయిశ్రీ రక్షిత 1000కి 980, నాగధనుశ్రీ 960, అబ్దుల్ హమీద్ 948, చైతన్య, సానియా తబసమ్ 947 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ మునిభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు సంజీవరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, మునిశ్రీనివాసరెడ్డి, శర్మ, అధ్యాపకులు అభినందించారు.



మాస్టర్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

విజ్ఞాన్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో..

విజ్ఞాన్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సాదియా 990, బైపీసీలో ఆయేషా 984, చాను 976, సీఈసీలో వసీమాసుల్తానా 948, కరీష్మా 941 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో మునిస్పందన 466, ఆయేషాఖాన్ 464, బైపీసీలో రాలియాబైష్మి 426, హర్షియా 422, సీఈసీలో ఫౌజియా 474 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఆలీ అక్బర్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఖాజామొహిద్దీన్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ కళాశాల అధ్యాపకులు

శారద జూనియర్ కళాశాలలో..



శారద జూనియర్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శారద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షా పలితాల్లో ప్రతిభ కనపరిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో భవానీ 450 మార్కులు, ఎంఈసీలో గీతిక 483 మార్కులు, హెచ్ఈసీలో రోష్ని 482 మార్కులు, హెచ్ఈసీలో యేషా 477 మార్కులు బైపీసీలో జ్యోతిర్మయి 413, గురుసందీప్ 400 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ దుర్గాభవానీ, కరస్పాండెంట్ సురేష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

భావన జూనియర్ కళాశాలలో..

భావనా జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వీరగణేష్ 989 మార్కులు, కమాల్‌బాష 541 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో లక్ష్మీదీపిక 464 మార్కులు, భార్గవి 462 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ రాజారెడ్డి, ప్రిన్సిపల్ సుబ్రమణ్యం శర్మ, డైరెక్టర్ షమీవుల్లా, అధ్యాపకులు నరసింహారెడ్డి, అబినందించారు.

శ్రీగీతం జూనియర్ కళాశాలలో..

శ్రీగీతం జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అతికాఅంజుమ్ 979 మార్కులు సాధించగా బైపీసీలో ఆక్సాపిర్దోస్ 970 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీలో శ్రీజ 464, వెంకటచంద్రిక 460, బైపీసీలో ఫిర్దోష్ 434, కరుణ 429 మార్కులు సాధించారు. విద్యార్థులను డైరెక్టర్లు విశ్వనాథరెడ్డి, దశరథ రామిరెడ్డి, రామమనోహర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, లోకేష్, రమేష్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొండాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షలో తమ ప్రతిభ కనబరచారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో కె.భవ్యశ్రీ 917 మార్కులు సాధించగా, ఆర్.నవనీత 802 మార్కులు నిలిచింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సిమ్రాన్‌బేగం 434 మార్కులు సాధించగా బైపీసీలో సీ.లావణ్య 417 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఫస్టియర్‌లో 86.95 ఉత్తీర్ణత , సెకండియర్‌లో 87.8 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు తెలిపారు.

రాజుపాలెంలో: వెల్లాలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. సీనియర్‌లో నాగపావని అనే విద్యార్థిని 963 మార్కులు బైపీసీలో సాధించగా జూని యర్‌లో వసంత ఎంపీసీలో 443 మార్కులు సాధించినట్లు తెలిపారు.

మైలవరంలో: ఇంటర్మీడియట్ పలితాలలో మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండ్ ఇయర్ విద్యార్థిని గోనా షారూన్ బైపీసీలో 982 మార్కులు సాధించిట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణ్‌రెడ్డి, అద్యాపక బృందం తెలిపారు. ప్రతిభ కనబరిచిన షారూన్‌కు ప్రిన్సిపాల్ పాగభూషణ్‌రెడ్డి నీట్‌కు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందించి రూ.5 వేల నగదు బహుమతిని అందించారు.

పోరుమామిళ్లలో: సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పోరుమామిళ్లలోని కస్తూర్బాగాంధి బాలికల కళాశాల విద్యార్థిని శ్వేత 938 మార్కులు, సీహెచ్ శ్రావ్య 930 మార్కులు, ఎన్.జయసుధ 928 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కె.నాగమల్లీశ్వరి తెలిపారు.

చాపాడులో: చాపాడులోని కస్తూరిబాగాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థులు మొత్తం 46 మంది పాసైనట్లు ఎస్‌వో నాగలక్షుమ్మ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 27 మంది, సీనియర్ ఇంటర్‌లో 19 మంది బాలికలు పాసయ్యారు. జూనియర్ ఇంటర్‌లో శిరీష ఎంపీసీ గ్రూపులో 436, సీనియర్ ఇంటర్‌లో పూజిత ఎంపీసీలో 878 మార్కులు సాధించినట్లు ఎస్‌వో తెలిపారు.



65 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు అశోక్‌నగర్ వీధిలో అక్రమంగా నిలువ ఉంచిన 65 బస్తాల రేషన్ బియ్యాన్ని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రొద్దుటూరు సీఎస్ డీటీ మల్లికార్జున నిర్వహించిన సంయుక్త దాడిలో పట్టుబడ్డాయి. వాటి విలువ సుమారు రూ.1,71,580 ఉంటుందని వారు అంచనా వేశారు. నేలటూరు చిన్నరంగడుకు చెందిన పాడుబడిన ఇంటిలో నిలువ ఉంచగా దాడిలో వీటిని పట్టుకున్నారు. పోతురాజు మహాలింగం అనే వ్యక్తి నిలువ ఉంచినట్లు గుర్తించారు. పోలీసులు విషయాన్ని ధ్రువీకరించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Badvel branch issues the following notice to the general public. My client intend to grant loan to **Chennupalli Subbaiah** S/o Chennupalli Venkata Subbaiah resident at D.no:1/86, Peddulapalli Village & Post, B.Kodur Mandal, YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY** : Residential building door number not yet allotted and vacant land situated kadapa dist, Kadapa Registration Dt, Badvel Sub Dt, and Municipality, Gopavaram Mdl, Madakalavaripalli Village fields in Circer Punj D.No.857/3B, 857/3C in this survey numbers to an extent of 193.6 Sq. yards. **BOUNDARIES**: EAST : Road, WEST: Road, NORTH: Site of Juturu Nagaraju, SOUTH: Site of Posani Rama Devi

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Badvel branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Gowri Kumari** W/o Sri Varakuti Dasu, R/o Perareddy Kottalu Village, Khajipeta Post and Mandal YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY** : The Property which is going to be mortgaged to the company is Residential building situated in Kadapa District, Proddatur, register District, Mydukur Sub District and Mandal, Sunkesula Grama Panchayat and Village, 4th ward, Door Nos. 4/492-2, 4/492-3, Sunkesula Village fields, Survey No. 185/2E, to an extent of Ac. 0.03 cents or 146 Sq. Yards **BOUNDARIES** : EAST : Site of Aaturu Chinna Yesanna, WEST: Panta Kaluva, NORTH: Site of Doraboina Paataiah, SOUTH: Rasta

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Badvel, Kadapa Distirct, I issue the public notice as follows.

One **Majjari Raveendra S/o Venkata Subbaiah,** 104-58, Raghunadhapuram, Badvel Mandal has applied for a loan to my clients firm offering the property mentioned below as security for the loan amount. Therefore if any others have got any right/possession, and in any cases are pending against the property in any court is should be brought to the notice of my client within five days from the dtae of this notice. Otherwise the loan amount will be sanctioned and disbursed to the applicant name above. If such objections are received after five days they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt. Badvel Sub-Dt. Badvel Municipal area, RCC Building bearind D.No.10-4-58 (Assessment No. 1123006123) of Badvel Municipality located in S.No.107 of Gunthapalli village fields **Boundaries :** East : Site of othes, South - Site of Majjari Potteiahgari Nadipi Chenchaiah, West - Road, North-House of Majjari Chinna Venkata Subbaiah. **Measurements :** East-West - 70ft or 21.33 mtrs., North-South:20.4 ft or 6.9-Total of 158.12 Sq. yards. **Measurements of RCC Building :** 1423.1 Sq. Feet in the above site - With all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

నరసింహుడికి క్షీరాభిషేకం

బద్వేలు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వల్లెరవారిపల్లె లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్లకు వేకువజామునే క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ ఈ నెల 14న స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు.

రామాలయం ప్రారంభోత్సవం

ముద్దనూరు ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కోడిగాండ్లపల్లెలో శనివారం కోదండ రామాలయ ప్రారంభోత్సవం వైభవంగా నిర్వహించారు.అందులో భాగంగా ధ్వజస్తంభం,సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం నిర్వహించారు. జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు.భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

హెల్మెట్ తప్పనిసరి

మైలవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రయాణించేటప్పుడు హెల్మెట్లు, సీటుబెల్టు తప్పనిసరిగా కలిగి ఉండాలని మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మైలవరం నాలుగు రోడ్ల కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి.. రోల్డ్‌గోల్డ్ గాజులు చోరీ

కొండాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొండాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గోరుశెట్టిరంగమ్మ అనే వృద్ధురాలు ఇంటి వరండాలో ఉండగా , ముసుగు ధరించి ఉన్న వ్యక్తి కత్తితో బెదిరించి ఆమె చేతికున్న రెండురోల్డ్‌గోల్డ్ గాజులను లాక్కెల్లాడు. బంగారు నగలు అనుకొని గాజులు తీసుకొని పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లెలో వ్యవసాయ పొలాల వద్ద ఏకంగా 15 మోటర్ల కరెంటు వైర్లను కత్తిరించి దొంగతనం చేసినట్లు రైతులు వాపోతున్నారు. పంటలకు సరైన ధర లభించక అల్లాడుతున్న తరుణంలో ఇలా మోటర్ల వైర్లు కూడా దొంగతనానికి గురౌవ్వడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. దొంగతనాలపై రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు.

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

కలసపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం ముద్దంవారిపల్లె గ్రామంలో అంకాళమ్మ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కుటుంబసభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు వారిని శాలువాలతో సత్కరించారు.

ప్రారంభమైన అంకాళమ్మ తిరునాళ్లు

ఖాజీపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అంకాళమ్మ తల్లి తిరునాళ్ల పౌర్ణమి పురస్కరించుకుని శనివారం ప్రారంభమై మూడు రోజులపాటు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. అంకాళమ్మ తిరునాళ్లకు వచ్చే భక్తులకు చలువపందిర్లు, మంచినీటి సౌకర్యం, ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

గోపవరంలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

గోపవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలంలోని భూమిరెడ్డిపల్లెలో శనివారం పోలేరమ్మ, గంగమ్మ, అంకాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠలను వైభవంగా నిర్వహించారు. అలాగా పోతురాజు విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడింది.

గరుడ వాహనంపై ఊరేగిన ఆది చెన్నకేశవుడు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు నిర్వహించారు.



